క్లుప్తంగా

మురుగునీటి సమస్య పరిష్కరించాలి



ఎంపీడీఓకు సమస్యను వివరిస్తున్న స్థానికులు

ఎల్.ఎన్.పేట: మండల కేంద్రంలోని జంగాల వీధికి వెళ్లే రోడ్డులో నెలకొన్న మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎంపీడీఓ పి.శ్రీనివాసరావును అదే వీధికి చెందిన వైశ్యరాజు పాండురంగనాథరాజుతోపాటు పలువురు కోరారు. ఎంపీడీఓకు సోమవారం ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి (ఏబీ)లోని అంబేడ్కర్ విగ్రహం పక్కనుంచి జంగాల వీధి వరకు ఇరువైపులా డ్రైనేజీ లేదన్నారు. మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తుందన్నారు. డ్రైనేజీ నిర్మాణం కోసం కొన్ని నెలల క్రితం జరిగిన పంచాయతీ గ్రామ సభలో నమోదు చేసినప్పటికీ నిధులు మంజూరు కాలేదన్నారు. డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



విడిభాగాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణ

కొత్తూరు: స్థానిక సీహెచ్‌సీ ఆవరణలో జీపు (మరమ్మతులకు గురైంది) మాయం కావడంపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మూర్తి అధికారులను కోరారు. సీహెచ్‌సీ వద్ద రెండు రోజుల క్రితం మాయమైన జీపు స్థానంలో విడిభాగాలు ఉండటాన్ని వెంకటరమణ పరిశీలించారు. దీనిపై డీసీహెచ్ఎస్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు.

పోలీసులకు ఫిర్యాదు..

సీహెచ్‌సీలో పాడైన జీపును తీసుకువెళ్లి, విడిభాగాలను విడిచిపెట్టిన ఘటనపై పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ తెలిపారు.

ఉత్తమ రైతులకు సత్కారం



గిరిజన రైతు అప్పారావును సత్కరిస్తున్న డీపీఎం రేవతి, అధికారులు

కొత్తూరు: జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పది మంది ఉత్తమ రైతులకు శ్రీకాకుళంలోని వ్యవసాయశాఖ జేడీ కార్యాలయంలో సోమవారం సత్కరించారు. కొత్తూరు మండలంలోని కారిగూడకు చెందిన సవర అప్పారావు, శోభనాపురం ఎస్టీ కాలనీకి చెందిన ఊయక జీవమ్మను డీపీఎం రేవతి, జిల్లా అధికారులు సత్కరించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కొత్తూరు వ్యవసాయ సబ్ డివిజన్ మాస్టర్ ట్రైనీ సవర సూర్యనారాయణ పాల్గొన్నారు.

మార్కెట్‌కు క్రిస్మస్ శోభ



కొనుగోలుదారుతో కిటకిటలాడుతున్న వస్త్ర దుకాణం

కొత్తూరు: క్రిస్మస్ వేడుకల సందర్భంగా మండల కేంద్రంలోని వస్త్ర దుకాణాలతోపాటు కిరాణా షాపులు కొనుగోలుదారులతో సోమవారం కిటకిటలాడాయి. కొత్తూరు, హిరమండలం, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని సీతంపేట, భామిని మండలాలకు, ఒడిశా రాష్ట్రంలోని కాశీనగర్, హడ్డుబంగితోపాటు పలు పరిహద్దు గ్రామాలకు కొత్తూరు మార్కెట్ కేంద్రంగా ఉంది. ప్రధానంగా గిరిజన గ్రామాల నుంచి ప్రతీరోజు వందల సంఖ్యలో ప్రజలు వచ్చి క్రిస్మస్ పండగకు అవసరమైన సామగ్రీ కొనుగోలు చేస్తున్నారు.

బాదుడే.. బాదుడు!

- అమాంతంగా పెరగనున్న రిజిస్ట్రేషన్ చార్జీలు
- నరసన్నపేట టౌన్‌లో 15 శాతం, గ్రామాల్లో 80 శాతం వరకు పెంచేందుకు ప్రతిపాదనలు
- నూతన చార్జీలు జనవరి ఒకటి నుంచి అమలు
- కొత్త సంవత్సరానికి కూటమి ప్రభుత్వ కానుక..!



నరసన్నపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నోటీస్ బోర్డులో పెట్టిన ధరల పెంపు వివరాలు

నరసన్నపేట: ప్రజల నుంచి ఎంత వరకు వీలైతే అంత మేరకు బాదుడు వేసి ఆదాయాన్ని పెంచుకోవాలని కూటమి ప్రభుత్వం చూస్తోంది. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతోంది. ఇప్పటికే నిత్యావసరాల ధరలు, విద్యుత్ చార్జీలు, టోల్ చార్జీలు పెరిగాయి. తాజాగా నూతన సంవత్సర కానుకగా భూముల రిజిస్ట్రేషన్ ధరలు పెంచేందుకు నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే రిజిస్ట్రేషన్, రెవెన్యూ అధికారులు కసరత్తు చేసి పెంపు ప్రతిపాదనలు చేశారు. వీటిని పరిశీలించిన జిల్లా అధికారులు ఇదేం పెంపు.. ఇలా అయితే పెద్దల నుంచి మాటలు పడతాం.. ప్రైవేట్ మార్కెట్‌కు అనుగుణంగా పెంపు ధరలు ఉండాలి, సవరించుకొని రావాలని ఒత్తిడి చేశారు. సబ్‌రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు ధరలు పెంపును మళ్లీ సవరించి ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు చూస్తే నరసన్నపేట సబ్‌రిజిస్ట్రార్ పరిధిలోని పోలాకి, నరసన్నపేట, జలుమూరు, కోటబొమ్మాళి ప్రాంతాల్లో పెరగనున్న రిజిస్ట్రేషన్ ధరలు రెట్టింపు స్థాయిలో ఉన్నాయి. నరసన్నపేట టౌన్‌లో ఇప్పుడున్న ధరలకు 15 శాతం మేరకు పెంచుతున్నారు. మైనర్ పంచాయతీల్లో అయితే రిజిస్ట్రేషన్ చార్జీలు 80 శాతం వరకు పెరగనున్నాయి. నమ్మి ఓట్లు వేసినందుకు తగిన బుద్ధి చెబుతున్నారని ప్రజలు గుండెలు బాదుకుంటున్నారు.

జనవరి 1 నుంచే కొత్త మార్కెట్ విలువలు..

పెంచిన మార్కెట్ విలువలు జనవరి ఒకటో తేదీ నుంచే అమల్లోకి రానున్నాయి. ప్రతిపాదించిన పెంపు ధరలు వివరాలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు ఇతర కార్యాలయాల్లో అధికారులు ప్రచురించారు. ఈ నెల 24వ తేదీ వరకు అభ్యంతరాలు ఉంటే స్వీకరించనున్నారు. వచ్చిన అభ్యంతరాలు 26వ తేదీలోగా పరిష్కరించి, 27న మళ్లీ ఫైనల్‌గా పెంపు ధరలకు ప్రకటిస్తారు. ఇలా అయితే భూముల క్రయవిక్రయాలు పూర్తిగా పడిపోతాయని, రియల్ వ్యాపారం కుదేలు అవుతుందని కొంతమంది అంటున్నారు. నరసన్నపేట టౌన్‌లో స్కేర్ ఫీట్‌లలో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. అన్ని ప్రాంతాల్లో ఒకేలా 15 శాతం మేరకు పెంచనున్నారు. పాత జాతీయ రహదారికి ఆనుకొని రేట్లు ఈ విధంగా ఉంటే ఇబ్బందని, లోపల వీధుల్లో కూడా ఈ ధరలే ఉంటే దారుణమని వాపోతున్నారు.

పెంపు కసరత్తు ఇలా..

- నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్, కలాసీ యూనియన్ ఆఫీస్ ప్రాంతాల్లో ప్రస్తుతం గజం రూ.13 వేలు ఉండగా.. దీనిని రూ.15 వేలుకు పెంచాలని ప్రతిపాదించారు. ఇక్కడ ప్రస్తుతం ఉన్న విలువకు 15 శాతం పెరుగుతుంది.
- పెద్దపేట, జమ్ము కూడలి పరిధిలో గజం రూ.15 వేలుకు ప్రతిపాదించారు.
- సెగిడివీధి, బండి వీధిల పరిధిలో గజానికి రూ.3 వేలు వరకు పెరగనున్నాయి. గ్రౌండ్‌ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్‌లలో కూడా ధరలను పెంచుతున్నారు. ఈ వీధుల్లో అడుగుకు రూ.600 పెరుగుతుంది.
- బజారు వీధి, నేతాజీ వీధి, లక్ష్మీ టాకీస్, కోవెల వీధుల్లో గజం రూ.3 వేలు రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగనున్నాయి.
- బొడ్డవలస ప్రాంతంలో ఏకంగా 54 శాతం మేర భూముల విలువ పెరగనుంది. ప్రస్తుతం ఎకరా రూ.13 నుంచి రూ.18 లక్షల వరకు ఉండగా.. దీనిని రూ. 20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పెంచనున్నారు.
- జమ్ములో 54 శాతం, గొట్టిపల్లిలో 17 నుంచి 33 శాతం, దేవాది ప్రాంతంలో 22 శాతం నుంచి 50 శాతం మేరకు ధరలు పెరగనున్నాయి.
- కోమర్తిలో డ్రై ల్యాండ్ 50 శాతం, వెట్ ల్యాండ్ 33 శాతం మేరకు పెంచుతున్నారు.
- మడపాంలో డ్రై ల్యాండ్ 50 శాతం, కరగాంల్లో వెట్ ల్యాండ్ 20 శాతం పెంచుతున్నారు.
- బాలసీమ, బసివలస, చేనులవలస, చిక్కాలవలసల్లో పల్లపు భూములు విలువ 63 శాతం, మెట్టు భూములు 50 శాతం పెరుగుతున్నాయి. తోటలు ఎకరా రూ.10 లక్షలు ఉండగా దీనిని రూ.17 లక్షలకు పెంచుతున్నారు. ఈ గ్రామాల్లో ఇళ్ల ధరలు రూ.20 లక్షల వరకు పెంచాలని నిర్ణయించారు.
- పోలాకి మండలంలో 80 శాతం మేరకు రిజిస్ట్రేషన్ ధరలు పెంచుతున్నారు. దీర్ఘాసి, ఈదులవలస, తొటాడ, అంప్లాం, చీడివలస తదితర గ్రామాల్లో 82 శాతం మేరకు ధరలు పెంచనున్నారు.

పునరాలోచన చేయాలి



కూటమి ప్రభుత్వం భూముల ధరలు పెంచాలని నిర్ణయించడం సమంజసమే అయినా.. ఇంత దారుణంగా పెంచాలని నిర్ణయించడం శోచనీయం. నరసన్నపేట టౌన్‌లో 15 శాతం పెంచడంతో రియల్ వ్యాపారం తగ్గుతుంది.

– మార్పు విజయ్, నరసన్నపేట

ప్రస్తుతం ఉన్నవి ప్రతిపాదిత ధరలే



ప్రభుత్వ ఆదేశాల మేరకు, జిల్లా అధికారుల సూచనలతో రిజిస్ట్రేషన్ ధరలు పెంచుతూ ప్రతిపాదనలు పంపాం. వీటిపై అభ్యంతరాలు తీసుకొని వాటి ఆధారంగా ఒక నిర్ణయానికి వస్తాం. జనవరి ఒకటో తేదీ నుంచి కొత్త ధరలు అమలులోకి వస్తాయి.

– బసవేశ్వరరావు, సబ్‌రిజిస్ట్రార్, నరసన్నపేట

జెలీస్ సాగుపై ఆసక్తి



సారవకోట మండలంలోని శివారు గ్రామాలైన చంద్రయ్యపేట, జరాళి రైతులు బీన్స్ సాగుపై ఆసక్తి కనబర్చుతున్నారు. ఈ రెండు గ్రామాల్లో సుమారు 12 ఎకరాల్లో బీన్స్ సాగు చేస్తున్నారు. ఈ గ్రామాలకు సమీపంలో ఉన్న టెక్కలి మండలంలోని గ్రామాల వారు ఈ సాగు చేస్తుండటంతో.. గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడి రైతులు బీన్స్ సాగు చేస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు.

– సారవకోట

జెఅసిత పూర్తిగా ..



సరుబుజ్జిలి మండలంలోని పాలవలస గ్రామసచివాలయం భవనం అసంపూర్తిగా మిగిలిపోయింది. శిథిలమైన గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే సచివాలయం సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఒకే కార్యాలయంలో అన్ని శాఖల విధులు నిర్వహించడం వలన వసతి సౌకర్యం సక్రమంగా లేక సిబ్బంది అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

జెటశోకనలు..



ఇటీవల కురిసిన వర్షాలకు జలుమూరు మండంలోని శ్రీముఖలింగం, అచ్యుతాపురం, నగిరికటకంతోపాటు పలు గ్రామాల్లో ఏఓ కె.సురేష్ సోమవారం పర్యటించారు. శ్రీముఖలింగంలో నీటి మునిగిన మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. తెగుళ్ల బారినపడకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. 25 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్ వేసుకుంటే పైరు పెరుగుదల బాగుంటుందన్నారు. మినుము, పెసర పంటల్లో నీటిని తొలగించి ఆరు కేజీల యూరియాతోపాటు రెండు కేజీల పొటాష్ వేసుకోవాలన్నారు. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

– జలుమూరు

తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: తుఫాన్ ప్రభావంతో నాలుగు రోజులు పాటు కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒకవైపు ఖరీఫ్ పంట చేతికి అందివచ్చే సమయం.. మరోవైపు రబీ పంట సాగు చేస్తున్న సమయంలో వర్షాలు రైతులకు అపార నష్టాన్ని మిగిల్చాయన్నారు. కోత కోసిన ఖరీఫ్ వరితోపాటు పొలాల్లో కుప్పలు పెట్టిన పంట కూడా తడిచిపోయిందన్నారు. పొలాల్లో నీరు చేరటం వలన కుప్పలు కిందకు నీరు చేరిందన్నారు. రబీ వరితోపాటు అపరాల పంటలైన పెసర, మినుము, వాణిజ్య పంట అయిన మొక్కజొన్న రైతులు నష్టపోయారన్నారు. పొలాల్లో ఇప్పటికీ నీరు నిలిచి ఉందన్నారు. ధాన్యాన్ని కాపాడుకునేందుకు రాయితీపై టార్పాలియన్లు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. ఈ ప్రభుత్వం రైతులపై పంటల బీమా బారం వేసిందన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ పథకం అందలేదన్నారు. రైతులే అప్పులు చేసి పెట్టుబడి పెట్టుకుని పంటలు పండించారన్నారు. రబీలో కూడా పెట్టుబడి సాయం ఇచ్చే పరిస్థితి కనిపించటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు ధాన్యం విక్రయించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొనుగోలు కేంద్రాల కంటే దళారులే ధాన్యం కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు.

ఘనంగా గణిత దినోత్సవం



పాతపట్నం: గణిత ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



సారవకోట: గణిత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జేబీటీ పాఠశాల సిబ్బంది

సారవకోట: మండలంలోని అవలింగి జేబీటీ పాఠశాలలో బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయులను సోమవారం సన్మానించారు. గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అడ్డపనస లోని బీవీకే పాఠశాలలో నిర్వహించిన గణిత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గణితంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించినట్లు పాఠశాల నిర్వాహకుడు వాడ పున్నయ్య తెలిపారు.

ఆకట్టుకున్న ప్రదర్శన

పాతపట్నం: స్థానిక ఆల్‌ఆంధ్రా రోడ్డు సమీపంలో ఉన్న అరమజ్యోతి పాఠశాలలో హెచ్ఎం ఎం.సోమేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీనివాసరామానుజన్ జయంతి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు చేసిన గణిత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విశ్రాంత ఉపాధ్యాయుడు జంబలి కాంతరావు, వైస్ ప్రిన్సిపాల్ ఇప్పిలి మురళి పాల్గొన్నారు.



సారవకోట: బీకేవీలో గణిత ప్రాజెక్టులతో విద్యార్థులు

నేడు ఆధ్యాత్మిక సమ్మేళనం

పొందూరు: ఈ నెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక పట్టుశాలి కల్యాణ మండపంలో ఏకం అనుగ్రహ, ఆధ్మాత్మిక, ఆరోగ్య చైతన్య కార్యక్రమం జరుగనుంది. ఈ విషయాన్ని స్థానిక ఏకం అనుగ్రహ విభాగం ప్రతినిధులు సోమవారం తెలిపారు. చిత్తూరు జిల్లా ఏకం పుణ్యక్షేత్రం చంద్రశేఖర్ దాస్ మార్గదర్శనం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనన్నారు.

వ్యాసరచన పోటీలు



వ్యాచరచన పోటీలను పర్యవేక్షిస్తున్న సురేష్

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల వినియోగదారుల ఆధ్వర్యంలో విద్యార్థులకు న్యాయవ్యవస్థతో కక్షిదారుకు మేలు అనే అంశంపై సోమవారం వ్యాచరచన పోటీలు నిర్వహించారు. తులుగు కేశవరావు, కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వినియోగదారులను ఎవరైనా మోసగిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే మేలు జరుగుతుందని మండల వినియోగదారుల అధ్యక్షుడు ఎ.వి.సురేష్ అన్నారు.

ఘనంగా మినీ క్రిస్మస్ వేడుకలు



ఏసు, వివిధ వేషధారణల్లో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

పాతపట్నం: స్థానిక రాజీవ్‌నగర్ వీధిలో ఉన్న జేసీపీఎం చర్చి ఆధ్వర్యంలో సోమవారం మినీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ప్రసాదరావు మాట్లాడుతూ ఏసు లోక రక్షకుడని, ప్రతి ఒక్కరూ నిజాయితీగా ఉండాలన్నారు. అనంతరం పాతపట్నం ప్రధాన రహదారిలో శాంతి ర్యాలీ చేపట్టారు. ప్రహరాజపాలెంలో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోనూ ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ వి.అర్చన ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. సంఘ సభ్యులు సంతోష్ కుమార్, వెంకటరమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.



గురుకులంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

నీటిలోనే పంటలు



సరుబుజ్జిలి: బుడ్డివలస వద్ద పొలాల్లో వరి కుప్పలు చుట్టూ చేరిన వర్షం నీరు



బూర్జ: ఇంజన్‌తో నీటిని తోడుతున్న రైతులు

సరుబుజ్జిలి: ఇటీవల కురిసిన వర్షాలకు రైతన్నలు తీవ్ర ఇక్కట్లుపడుతున్నారు. మండలంలోని కూనజమ్మన్నపేట, బుడ్డివలస, వ్యాసులపేట, తురకపేట, పెద్దపాలెం, చిన్నపాలెం గ్రామాల్లో వర్షం నీరు వరి కుప్పలు చుట్టూ చేరడం వలన నష్టం వాటిల్లే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో తుఫాన్ సమీపిస్తున్నందున ఇప్పటికే వర్షంనీరు పొలాల్లో నిల్వ చేరడం వలన అపరాల పంటలకు కూడా నష్టం వాటిల్ల వచ్చునని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పెసర పొలంలో వర్షంనీరు

బూర్జ: మండలంలోని కొల్లివలస గ్రామంలో పెసర చేనులో నిల్వ ఉన్న నీటిని సోమవారం నీటి ఇంజన్ సహాయంతో రైతు తోడించారు. ఇటీవల నాలుగు రోజులు కురిసిన వర్షం నీరు నిల్వ ఉండటంతో పంటను కాపాడే ప్రయ్నం చేశారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి హాజరయ్యారు. తన భూమిని రీ సర్వే నిర్వహించి, ఇతరుల పేరు మీద రెవెన్యూ అధికారులు నమోదు చేశారని, రెండు కాళ్లు లేని తాను పలుమార్లు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి అధికారులకు మొర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఎమ్మెల్యే దృష్టికి బూర్జ మండలం బోరగవలస గ్రామానికి చెందిన ధర్మవరపు ఆదిలక్ష్మి తీసుకువచ్చారు. సంబంధిత వీఆర్‌ఓతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. పలువురు రెవెన్యూ సమస్యలపై అర్జీలు అందజేశారు. పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన భూములు ఆక్రమణలకు గురైనట్లు ఫిర్యాదులు అందాయి. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురు వ్యక్తులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.16 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్ పి.రాంబాబు, మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోపి, ఆర్ఐ పప్పల గోవిందరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస: వినియోగదారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి, ఐఎస్ఐ గుర్తింపు ఉన్న నాణ్యమైన వస్తువులు కొనుగోలు చేయాలని తొగరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామారావు అన్నారు. వినియోగదారుల క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్, ఐక్యూ ఏసీ సమన్వయకర్త డాక్టర్ డి.పైడితల్లి మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్ ప్రపంచంలో వినియోగదారుడే రారాజు అని అన్నారు. వినియోదారునికి అన్యాయం జరిగితే జిల్లా స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు వినియోగదారుల ఫోరం ద్వారా న్యాయం పొందవచ్చన్నారు. కో కన్వీనర్ టి.శ్రీనివాసరావు, సమన్వయకర్త పి.శ్రీనివాసరావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతే దేశానికి వెన్నెముక



రైతులకు అవగాహన కల్పిస్తున్న రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు

సరుబుజ్జిలి: నిరంతరం కష్టపడే రైతులే దేశానికి వెన్నెముక అని రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు అత్తులూరి లావణ్య, బాన్న రాజ్‌కుమార్ అన్నారు. జాతీయ రైతు దినోత్సవాన్ని వెన్నెలవలస గ్రామంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సాగులో తీసుకోవాల్సిన మెలకువలు, నూతన పోకడలు, యంత్రీకరణపద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.